# హల్లో! మిస్టర్!

**సోడా మిస్టర్... మిస్టర్... సోడా!... మిస్టర్ కిల్లీ... మిస్టర్... మిస్టర్... రైలెళ్లిపోతోంది మిస్టర్....**

ఇదిగో మిస్టర్... ఈ స్టేషన్‌లో రైలెంత సేపుంటుంది?- మిస్టర్ వాటర్ మిస్టర్... ఏయ్ మిస్టర్... ఫ్రెష్ వాటర్....

ఇలాంటి కేకలు పెడుతూ వుంటారు ప్రయాణీకులు.... రైలు వచ్చి స్టేషన్‌లో నిలబడగానే పెట్టెలోకి ఎవరన్నా ఎక్కబోతే అందులో వున్నవాళ్లు "ఇదిగో మిస్టర్... ఇక్కడ చోటులేదు... ఇంకో పెట్టెలో ఎక్కు..."

అదే సమయంలో కొందరు త్వరగా ఎక్కేస్తారు. పెట్టెలో... గబగబా లోనికి పోతూ వుంటారు. ఒక వ్యక్తి బూట్ మిస్టర్!- బూట్... చచ్చా మిస్టర్... చచ్చా'... అంటారు. అంటే అతని బూటుకాలు ఇతని కాలు మీద వేసి తొక్కాడన్న మాట... అతడు బాధపడుతున్నాడన్న మాట.

"ఏమయ్యోయి! నీ కాలు నా కాలు మీద పడ్డింది అప్పచ్చి అయిపోయింది. తియ్యవయ్యా"అని చెబితే బాగుండును. అలా చెప్పడు... నాజూగ్గా, భావగర్భితంగా- బూట్ మిస్టర్ అంటాడు.

ఒకసారి అలాగే బూటుక్రింద కాలుపడి నలుగుతున్న సమయంలో- బూట్ మిస్టర్ అంటే- 'ఎస్. బూట్ ఫార్టీ రుపీస్' అని అతడలాగే నుంచున్నాడట. అప్పుడా బాధ పడుతున్న వ్యక్తీ..., ఖరీదెవరిక్కావాలయ్యా నా కాలు తొక్కుతున్నావు? కొంచెం తియ్య'మన్నాడట.

ఇంతలోకే టికెట్టు కలెక్టరు వస్తాడు పెట్టెలోకి- చేతిలో ఉన్న పంచింగ్ మెషిన్ బల్లకేసి కొడుతూ 'మిస్టర్ టికెట్' అంటాడు. అతగాడు ఏ నిద్రమత్తులోనో వుండి పలక్కపోతే ఇంకా కొంచెం గట్టిగా చప్పుడు చేస్తూ విస్నే మిస్టర్! టికెట్టు అని అరుస్తాడు.

ఈ మిష్టర్ శబ్దం ఒక చోట అని కాదు. ఒక్క వ్యక్తిపరంగా అని కాదు- ఎవర్నిపడితే వారినే 'మిష్టర్' అనడం మామూలైపోయింది.

కాఫీహోటల్లోకి వెళ్లి కూర్చోగానే, సర్వరు వంక చూచి 'ఏం వుంది మిష్టర్?' అని ప్రశ్న.

అతడు దండకం చదవగానే,- తనతో వచ్చిన వాడివంక చూచి 'ఏం తీసుకుంటావు, మిష్టర్' అని ప్రశ్న.

సర్వరు వచ్చి బల్ల తుడిచి పోతుంటే- 'కొంచెం ఫ్యాను కొట్టు మిష్టర్' అని అభ్యర్థన-

*** *** *** ***

భార్యల్ని కూడా 'మిష్టర్' అని పిలిచి సంతోషపడేవాళ్లు చాలామంది వున్నారు.... ఒకరింటికి వెళ్లి మాట్లాడుతుంటే ఆ యజమాని మాటలు ఆపి 'మిష్టర్' అని కేకపెట్టాడు. లోపలి నుంచి ఒక పిల్ల వచ్చి మిష్టరు లేదు. ఆమె సిష్టరు వుంది అన్నది.

'ఓ చిన్న మిష్టరా! ఒకసారి యిలా పిలు' అన్నాడాయన. ఇంతలో ఒకావిడ వచ్చింది.... ఆమె రాగానే పెద్ద 'మిష్టరు' ఏం చేస్తున్నదని అన్నాడాయన.. .

'రెస్టు తీసుకుంటున్నారు' అన్నదామె.

'అలాగా!' అయితే! చిన్న మిష్టర్! రెండు కప్పుల కాఫీ పంపించు... అని నా వంక చూచి, 'ఏం మిష్టర్ కాఫీయా! టీయా!' అన్నాడు.

నాకేం వద్దు... అన్నాను. అంటే ఆయన వూరుకుంటాడా? మా చిన్న మిష్టర్ కాఫీ బాగానే చేస్తుంది.... చూడాలి మీరు అని ఆమె వంక చూచి నవ్వాడు.....

ఆవిడ లోనికి వెళ్లింది. నా నవ్వు నీ నవ్వు అంత తేలికకాదు అన్నట్లు పెదిమలు బిగించుకుని.

భార్యల్ని భర్తలు మిష్టర్ అనడం సరే.... కొందరు నవనాగరిక నారీమణులు భర్తల్ని 'మిష్టర్' అని పిలవడం కూడా అమలులో వుంది- ఆమె ఖర్మం చాలక ఏ వుద్యోగంలోనో వుంటే ఆఫీసుకు బయలుదేరే ముందు 'మిష్టర్' నే పోతున్నా... కొంచెం తలుపు వేసుకో. అనడం మామూలు. కొంచెం దూరం వెళ్లి ఆగి ఇదిగో 'మిష్టర్' నా పెన్ను మరచిపోయా కొంచెం ఇలా అందిస్తావు? అన డంకూడా జరుగుతూ వుంటుంది-

ఒక ఉద్యోగస్థురాలి యింటికి వెళ్లాం. ఆమె అప్పుడే వుద్యోగ కేంద్రం నుంచి ఇంటికి చేరింది. రాగానే మాతో ఒక్క ముక్క మాట్లాడి, భర్త వంక చూచి 'కాఫీ కావాలి... మిష్టర్! చాలా టైర్డు అయిపోయాను' అంది. ఆయన అదో విధంగా ముఖం పెట్టి లోపలికి

హల్లో! మిస్టర్! ఫలహారాలు ఏం వున్నాయ్?...



# హల్లో! మిస్టర్!

-సర్వా సుబ్రహ్మణ్యం

వెళ్లబోతుండగా....

ఆవిడ మిష్టర్! మిష్టర్! రెండు బిస్కట్లుంటే పెట్టు... వట్టి కాఫీ అట్టే బాగుండదు అంది.

పాపమాయన బిస్కట్లు తెచ్చియిచ్చాడు... వాటిని స్వీకరిస్తూ ఆమె ప్రసంగం ప్రారంభించింది- తర్వాత ఆయన కాఫీ తెచ్చి యిచ్చాడు.....

'మరి వారికేది మిష్టర్ కాఫీ' అన్నదామె... .ఆయన మాట్లాడలా....

'గెస్టులకు కాఫీ లేకుండా ఎలా మిష్టర్ ఫ్లాస్కు తీసుకువెళ్లి తీసుకురా త్వరగా... ఎలాగూ వెళుతున్నావు గనుక కొంచెం టిఫిన్ కూడా తీసుకురావడం మంచిది. .' ఆయన ఫ్లాస్కు తీసుకొని బయలుదేరాడు.

గుమ్మం దాటనిచ్చి మళ్లీ మిస్టర్ అని కేకేసిందామె.

పాపమాయన కోపం పట్టలేకపోయాడు..

ఏమిటి! 'మిష్టర్' వట్టి డస్టర్ క్రింద తయారుచేశావు. దిక్కుమారిన పిలుపు అన్నాడు.

ఆవిడ నవ్వి 'అవును డష్టరే! నా కష్టాల్ని తుడిచివేసే డస్టర్... నా ఆకల్ని తుడిచివేసే డష్టర్' అయినా అంత కోపమైతే ఎలా మిష్టర్! ఇవాళ ఆంధ్రసచిత్రవారపత్రిక వస్తుంది. అది కూడా ఒకటి తీసుకురా అంది. ఆయన గొణుక్కుంటూ వెళ్లిపోయాడు.

ఒకసారి ఒక పెద్దమనిషి ఒక ఆఫీసరుని చూడాలని ఆయనగారి బంగళాకు వెళ్లాడట. నౌకరు వచ్చి అయ్యగారు లేరు ఎక్కడికో వెళ్లారు- ఒక పావుగంటలో వస్తామన్నారు అని చెప్పాడట. పావుగంటే గదా అని, ఆయన అక్కడే కూర్చున్నాడట.

ఇంతలో ఇంట్లో నుంచి ఒక ఆడ గొంతు మాటలు ఇలా వినబడ్డాయట. ఇదిగో 'మిష్టర్' అక్కడ కూర్చున్నావేం. ఇలా దగ్గరికిరా, త్వరగా... అంత దూరంగా కూర్చుంటే ఎలా? ఇంకా దగ్గరికి రావాలి... అది... అది... అలా కూర్చోవాలి... ఒక రవ్వ జరుగు 'మిష్టర్-' రెండు బిస్కట్లు తెస్తాను. అని కొంచెం ఆగి- ఆ! యిప్పుడు రా దగ్గరికి' అంటుందిట.

వాకిట్లో కూర్చున్న వ్యక్తి ఖంగారుపడిపోతున్నాడట... ఇంత ఇదిగా మాట్లాడుతోందేమా అని....

ఇంతలో మళ్లీ మాటలు వినిపించాయట. 'నువ్వెప్పుడూ నా దగ్గరే వుండాలి 'మిష్టర్'. అంత దూరంగా నే భరించలేను. నువ్విలా దగ్గరగా వుండాలి... నీ తల నా తల దగ్గరగా ఉండాలి అని.

వాకిట్లో కూర్చున్న వ్యక్తికి ఇంచుమించుగా మతిపోతోందట. ఇంతలో నౌకరు వాకిట్లోకి వచ్చాడట ఆయనగారు ధైర్యం చేసి అడిగాడట.

అయ్యగారు ఇంట్లో లేరన్నావుగా... మరి ఎవరితో అమ్మగారలా మాట్లాడుతున్నారు- అని.

'అమ్మగారు మాట్లాడేదా!... అల్సేషియన్ కుక్కతో... అన్నాడట. కుక్కతోనా! అయితే చిక్కులేదు. .' అని ఆయన తిరిగి బల్లమీద చతికెలపడ్డాడట.

ఇలాంటి తమాషాలు ఇంకా ఎన్నో జరుగుతూ వుంటాయి.

'మిష్టరుకు' సంబంధించిన మరో చిన్న తమాషా.

ఇటీవలనే ఒక పెద్దమనిషి, యం. ఎల్. ఏ. పోటీకి నిలిచిన ఒక పరిచితుణ్ణి చూడడానికి వెళ్లాడట. ఆయన కనిపించగానే 'ఏం మిష్టర్, ఏమిటి విశేషాలు?' అని ప్రశ్నించాడట. ఆ అభ్యర్థిగారికి కోపం వచ్చి-

'మిష్టర్ సరే! 'మి' తర్వాత 'ని' కూడా కలపవయ్యా కొంచెం అన్నారుట.

'ని' కలపడమేమిటి? నాకు అర్థంకావడంలేదు అన్నాడుట ఆ పెద్దమనిషి.

అవునయ్యా! ఇన్నాళ్లు 'మిష్టర్....' 'మిష్టర్...' అన్నావుసరే!... ఇక అనబోకు... 'ని' కూడా కలుపు అంటే తెలియలేదా? మిష్టరు'కి' 'ని' కలిపితే... 'మినిష్టరు' కాదటయ్యా... ఈసారి మనం తప్పకుండా అవుతాం అని- ఆ అనేది కొంచెం ముందుగానే అంటే నాకు చాలా ప్రచారమవుతుంది- నీకు జ్యోతిషం తెలిసినట్లవుతుంది', అన్నారట ●

